వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 16 డిసెంబర్ 2024
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 144
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో


**కేంద్ర పురావస్తు శాఖ అధీనంలోకి మరిన్ని కట్టడాలు తీసుకోవాలి: టార్చ్**

# అప్పులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

**రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి**

**రైతులకు వివిధ పథకాలతో రూ.50,933 కోట్లు అందించాం**

**భూమిలేని పేదలకు రూ.12 వేలు.. ఈనెల 28న శ్రీకారం**



ఖమ్మం:గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎడాపెడా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి, ఇప్పుడు ఆ అప్పులపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7,11,911 కోట్ల అప్పులు చేసి ప్రజలపై తీరని భారం మోపిందన్నారు.రాష్ట్రానికి తెచ్చిన అప్పులను బీఆర్ఎస్ నాయకులు దోచుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన అప్పులతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూనే వాళ్ల తెచ్చిన అప్పులు తీరుస్తున్నామని పేర్కొన్నారు. ఖమ్మం డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీనే అప్పుల పాలు చేయగా.. ఇప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్ గాయిగత్తర చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలను శ్వేతపత్రం ద్వారా విడుదల చేసి ప్రజల ముందు ఉంచామని భట్టి గుర్తుచేశారు. రానున్న సంక్రాంతికి రైతు భరోసా డబ్బు సైతం జమ చేస్తామని, ఇప్పటివరకు మొత్తం రూ.50,953 కోట్లను రైతుల

మిగతా 2లో

## తిరోగమనంలో తెలంగాణ: కేటీఆర్

హైదరాబాద్: పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన తెలంగాణ.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి అనుభవరాహిత్యం, అవినీతి పాలనలో అన్ని రంగాల్లో తిరోగమిస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర రవాణా శాఖ ఆదాయం తగ్గుదలపై కేటీఆర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ. ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాకుండా.. ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయి. కానీ, రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు తగ్గి.. ఆదాయం తిరోగమనంలో ఉంది. పొరుగున ఉన్న ఐదు రాష్ట్రాలు ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8% నుంచి 32% వృద్ధిని నమోదు చేస్తే.. తెలంగాణ గత ఏడాది కంటే తక్కువ వృద్ధిని నమోదు చేసింది.



**పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన తెలంగాణ.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి అనుభవరాహిత్యం, అవినీతి పాలనలో అన్ని రంగాల్లో తిరోగమిస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు.**

## పార్టీ మారిన నేతలు.. అసెంబ్లీలో ఏ ముఖంతో మాట్లాడతారు: కవిత



జగిత్యాల: జగిత్యాల అంటే బీఆర్ఎస్ అడ్డా అని చెప్పుకొచ్చారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. ఎన్నికల్లో కేసీఆర్ బొమ్మ పెట్టుకుని గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని, బతుకమ్మను దూరం చేసిందని ఘాటు విమర్శలు చేశారు.ఎమ్మెల్సీ కవిత ఆదివారం జగిత్యాలలో పర్యటించనున్నారు. నియోజకవర్గంలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. జగిత్యాల అంటే బీఆర్ఎస్ అడ్డా. మీరు గెలిపించిన నాయకుడు పార్టీకి ద్రోహం చేసిన వెళ్లిపోయాడు. ఎన్నికల్లో కేసీఆర్ బొమ్మ పెట్టుకొని గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ అసెంబ్లీకి వెళ్ళి ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతాడో చూద్దాం. జగిత్యాలకి ఒక్క రూపాయి రాలేదు, జగిత్యాలలో అభివృద్ధి ఏమీ జరగలేదు.పైసల కోసం సంజయ్ పార్టీ మారాడు. పైసలా కోసం పార్టీ మారిన వ్యక్తులు నాయకులే కాదు. మిమ్మల్ని చూస్తే అర్థం అవుతుంది మీలో ఒకరు ఎమ్మెల్యే అవుతారు. కేసీఆర్‌కు సైనికులుగా మీరంతా ఉన్నారు. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే. కాంగ్రెస్ ప్రభుత్వం మనకు తెలంగాణ తల్లిని, బతుకమ్మను దూరం చేసింది. అధికారం కోసం కాంగ్రెస్ నేతలు ఎన్నో హామీలు ఇచ్చారు.

## సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి

**ఆయన ఏనాడూ జై తెలంగాణ అనలేదు ప్రజా యుద్ధనౌక గద్దర్ లేకుండా ఏ ఉద్యమాలూ లేవు: హరీశ్‌రావు**



సిద్దిపేట: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి అని, ఆయన ఏనాడూ జై తెలంగాణ అనలేదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ సాహిత్య పుస్తకావిష్కరణ సభలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అవార్డుల పేరుతో తన మరకలను కడిగేసుకొనే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను తీసేసి, విగ్రహ రూపాన్ని మార్చడం నచ్చకనే కవి నందిని సిధారెడ్డి ప్రభుత్వ ఇవ్వజూపిన నజరానా, ఇంటి స్థలాన్ని తిరస్కరించారని తెలిపారు. రూ.కోటి రూపాయలు ముఖ్యం కాదని, మూడు కోట్ల తెలంగాణ ప్రజల ఆదరాభిమానాలే ముఖ్యమని చాటిన నందిని సిధారెడ్డి ఎంతో గొప్పవారని అభినందించారు.

మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర

తెలంగాణ ఉద్యమానికి గద్దర్ ప్రజాగొంతుకగా నిలిచారని హరీశ్‌రావు అన్నారు. ఆయన లేనిది ఏ ఉద్యమం లేదు.. మలిదశలోనూ గద్దర్ కీలక పాత్ర పోషించారు అని కొనియాడారు. గద్దర్ పోరాటం భావితరాలకు తెలిసేలా పుస్తకాలు ముద్రించటం మంచి ఆలోచన అని ప్రశంసించారు. తండ్రి పోరాటాన్ని, గొప్పతనాన్ని రేపటి తరాలకు అందించి నిజమైన వారసుడు అనిపించుకున్నారని గద్దర్ కుమారుడు సూర్యకిరణ్‌ను అభినందించారు. గద్దర్ పాట ఉన్నంత కాలం ప్రజల మధ్య ఆయన సజీవంగా ఉంటారన్నారు. సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసే ఆలోచన అభినందనీయమని, గద్దర్ జీవిత చరిత్రతో కూడిన డాక్యుమెంటరీ తయారీ చేయాలని, అందుకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

# నేడు అసెంబ్లీ పునఃప్రారంభం

**నేడు ప్రశ్నోత్తరాలు.. సంతాపాలు, రెండు బిల్లులు, స్వల్పకాలిక చర్చ**

**బెల్టుషాపుల మూసివేత, పెండింగ్ బిల్లులు, టీజీఐఐసీ పార్కులపై ప్రభుత్వ సమాధానం**

**స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు మరో బిల్లు ప్రవేశపెట్టనున్న సర్కారు**

**పర్యాటక విధానంపై అసెంబ్లీ, మండలిలో స్వల్పకాలిక చర్చ**

హైదరాబాద్: అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి. శాసనసభతోపాటు మండలి కూడా ఉదయం 10:30 గంటలకు భేటీ కానున్నాయి. ఈనెల 9వ తేదీన ప్రారంభమైన శీతాకాల సమావేశాలు తొలిరోజు భేటీ అనంతరం సోమవారానికి వాయిదా పడిన విషయం తెలిసిందే. రెండోరోజు ఎజెండాలో భాగంగా రెండు సభల్లోనూ తొలుత ప్రశ్నోత్తరాలు ఉంటాయి. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి జ్యోతి, ఊకె అబ్బయ్య, డి.రామచంద్రారెడ్డిల మృతి పట్ల అసెంబ్లీలో సంతాప తీర్మానాలను ప్రభుత్వం ప్రవేశపెడుతుంది.వీరికి సంతాపం తెలిపిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ, తెలంగాణ విశ్వవిద్యాలయాల బిల్లు(సవరణ)%–%2024ను ప్రవేశపెడతారు. ఈబిల్లులపై చర్చించి ఆమోదం తెలిపిన అనంతరం 'తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక విధానం'పై స్వల్పకాలిక చర్చ ఉంటుంది.శాసనమండలిలోనూ ప్రశ్నోత్తరాల అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఎన్.ఇంద్రసేనారెడ్డి మృతి పట్ల సంతాప తీర్మానం, అనంతరం పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ జరుగుతుంది. ఈ మేరకు సోమవారం ఎజెండాను అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు విడుదల చేశారు.

పలు కీలక ప్రశ్నలు: అటు అసెంబ్లీ, ఇటు మండలిలో పలు కీలక ప్రశ్నలపై రాష్ట్ర ప్రభు త్వం సమాధానం ఇవ్వనుంది. గ్రామ పంచాయతీల్లో బీటీ రోడ్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల క్రమబద్ధీకరణ, స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, ముదిరెడ్డిపల్లి చెరువులో నీటి కాలుష్యం, రాష్ట్రంలో నూతన టీజీఐఐసీ పార్కుల ఏర్పాటు, పర్యాటకానికి ప్రోత్సాహం, ఓయూలో బీఈ విద్యార్థుల డిటెన్షన్, రాష్ట్రంలోని బెల్టుషాపుల మూసివేత, ఐవీఎఫ్ కేంద్రాలు, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలపై సభ్యులు అడిగే పలు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం సమాధానం ఇవ్వడంతోపాటు ఈ అంశాల్లో అనుసరించే విధానాలను వెల్లడించనుంది.


మండలిలో రాష్ట్రంలో టైగర్ రిజర్వుల అభివృద్ధి, ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవనాల నిర్మాణం, కొత్త రేషన్‌కార్డుల జారీ, తేనెటీగలు, పట్టు పురుగల పరిశోధన కేంద్రం ఏర్పాటు, వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీ, రేషన్ డీలర్ల గౌరవ వేతనం, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, తెలంగాణలో టీటీడీ ఆస్తులు, కొత్త బీసీ గురుకులాల ఏర్పాటు, జిల్లాల పునర్వ్యవస్థీకరణలపై ప్రభుత్వం సమాధానం ఇస్తుంది.

సమావేశాలు ఎప్పటివరకు?

అసెంబ్లీ శీతాకాల సమావేశాలను ఎప్పటివరకు కొనసాగించాలన్న దానిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం నిర్ణయం తీసుకోనున్నారు. ప్రశ్నోత్తరాల అనంతరం స్పీకర్ చాంబర్‌లో జరిగే సభా వ్యవహారాల సలహా కమిటీ భేటీలో సభను ఏఏ రోజుల్లో, ఎన్ని రోజుల పాటు నడిపించాలన్న దానిపై చర్చించిన అనంతరం అధికారికంగా ప్రకటిస్తారు. శీతాకాల సమావేశాలు ఈ వారం మొత్తం సాగే అవకాశాలున్నాయని తెలుస్తోంది. దీనిపై బీఏసీలో తుది నిర్ణయం జరగనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాలు కొత్త ఆర్‌వోఆర్ చట్టం, కులగణన, రైతు భరోసా తదితర అంశాల ఎజెండాగా కొనసాగుతుందని తెలుస్తోంది.



వేగుచుక్క



## అప్పులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భూమి లేని నిరుపేదలకు రూ.12 వేల చొప్పున రెండు విడతలుగా సాయం అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు వరంగల్, రామగుండం, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలు నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసి రైతులకు వారంలోపే డబ్బులు, సన్నాలకు బోనస్‌ను సైతం అందిస్తున్నామని తెలిపారు.

అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఓఆర్ఆర్%-%ట్రిపుల్ ఆర్ మధ్య ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు అందిస్తామని చెప్పారు. వసతి గృహాల్లో నూతనంగా పెంచిన డైట్ చార్జీలతో ప్రభుత్వంపై ఏడాదికి రూ. 541 కోట్ల భారం పడుతుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో డైట్ చార్జీలు పెంచలేదని, అందుకే అన్నంలో పురుగులు వంటివి వచ్చాయని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై తప్పుడు కథనాలు ప్రచురిస్తే నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేల మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించామని చెప్పారు.

## కేంద్ర పురావస్తు శాఖ అధీనంలోకి మరిన్ని కట్టడాలు తీసుకోవాలి: టార్చ్



హైదరాబాద్: కేంద్ర పురావస్తు శాఖ గుర్తింపు పొందిన కట్టడాలు తెలంగాణలో ఎనిమిది మాత్రమే ఉన్నాయని, మరిన్ని కట్టడాలను శాఖ అధీనంలోకి తీసుకొని పరిరక్షించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని 'టీం ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్' (టార్చ్) సంస్థ ప్రతినిధులు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో వారు కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏపీలో 130కి పైగా వారసత్వ కట్టడాలను కేంద్ర పురావస్తు శాఖ గుర్తించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన కట్టడాలు దాదాపు 70 వరకు ఉన్నాయని, వాటన్నింటినీ కేంద్ర పురావస్తు శాఖ అధీనంలోకి తీసుకోవాలని కోరారు. కోట్ల సంవత్సరాల క్రితం మనుగడ సాగించిన జీవజాతుల శిలాజాలు(ఫాసిల్స్) రాష్ట్రంలో లభ్యమవుతున్నాయని.. వాటి సంరక్షణ, పరిశోధనల కోసం ప్రత్యేకంగా ఫాసిల్ పార్క్ నిర్మించాలనీ విన్నవించారు. తమ వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించారని టార్చ్ కార్యదర్శి అరవింద్ ఆర్య తెలిపారు.

## భారత్‌లో అక్రమ చొరబాట్లు.. కేంద్రానిదే బాధ్యత: ఆతిశీ



బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమ చొరబాట్లపై కేంద్రమే బాధ్యత వహించాలని దిల్లీ సీఎం ఆతిశీ అన్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు.

దిల్లీ: భారత్‌లోకి అక్రమంగా ప్రవేశిస్తున్న రోహింగ్యాలు వారి పునరావాసాలపై దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్రమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అక్రమ చొరబాట్లకు కేంద్రమే బాధ్యత వహించాలన్నారు. "నిత్యం బంగ్లాదేశ్ నుంచి వేల సంఖ్యలో అక్రమచొరబాట్లు జరుగుతున్నట్టు ఇటీవల ఓ మీడియా సంస్థ కథనం ప్రచురించింది. వారు సరిహద్దును ఎలా దాటుతున్నారో తెలిపింది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశ సరిహద్దులను రక్షించడంలో విఫలమైన తీరుకు ఇది అద్దం పడుతోంది. అంతేకాకుండా రోహింగ్యాలకు దిల్లీలో పునరావాసంతో పాటు తగిన వసతులు కల్పించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది" అని ఆతిశీ లేఖలో పేర్కొన్నారు. ఇదే విషయంపై ఇటీవల ఆప్ జాతీయ కన్వీనర్ కేంద్రంపై నిప్పులు చెరిగారు. ఆయన ఆరోపణలపై స్పందించిన భాజపా.. ఎన్నికల్లో రోహింగ్యాలను ఓటు బ్యాంకుగా మార్చేందుకు ఆప్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. కేజ్రీవాల్‌పై చేసిన ఆరోపణలపై తాజాగా స్పందించిన ఆతిశీ లేఖలో ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా.. దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు ఆప్ అభ్యర్థుల తుది జాబితా విడుదల చేసింది.

జమిలి ఎన్నికల బిల్లులపై పునరాలోచనలో కేంద్రం..! మొత్తం 70 స్థానాలు కలిగిన దిల్లీ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు ఇప్పటికే ఆప్ మూడు జాబితాలను ప్రకటించగా.. తాజాగా 38మంది అభ్యర్థులతో తుది జాబితాను విడుదల చేసింది. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ న్యూదిల్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతుండగా.. సీఎం ఆతిశీ మరోసారి కాల్కాజీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకునేందుకు లేదని ఇప్పటికే ఆప్ స్పష్టం చేసింది.

## 'నా మనవడు ఎక్కడ'..? అతుల్ తండ్రి ఆందోళన



భార్య వేధింపులు తాళలేక టెకీ ఆత్మహత్య చేసుకొన్న ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఆయన భార్య నిఖితా సింఘానియా, ఆమె కుటుంబ సభ్యులను బెంగళూరు పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన మనవడు ఎక్కడంటూ.. అతుల్ తండ్రి పవన్ కుమార్ మోదీ కోడలు నిఖితాను ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడి ఆత్మహత్యకు కారణమైన నిఖిత, ఆమె కుటుంబ సభ్యులను అరెస్టు చేసినందుకు పోలీసులకు పవన్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. '2020లో అతుల్‌కు కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత నిఖితా, నా కుమారుడు విడిపోయారు. నాటి నుంచి నా మనవడిని చూడలేదు. కేవలం వీడియో కాల్స్‌లో మాత్రమే చూశాం. ఇప్పుడు ఆ చిన్నారిని ఎక్కడ ఉంచిందో తెలియదు. అతడు అసలు జీవించి ఉన్నాడో లేదో..?. మా కుటుంబ సభ్యులందరం ఆందోళన చెందుతున్నాం. దయచేసి అతడిని మాకు అప్పగించండి. నా దగ్గర ఉంటేనే అతడు క్షేమంగా ఉంటాడు' అని అతుల్ తండ్రి వాపోయారు. బెంగుళూరు టెకీ ఆత్మహత్య

.. అతుల్ సుభాష్ భార్య అరెస్టు

భార్య సతాయింపులు తట్టుకోలేక అతుల్ సుభాష్ బెంగళూరులో ఆత్మహత్య చేసుకొన్నాడు. మరణానికి ముందు ఆయన ఏకంగా 40 పేజీల లేఖ రాశాడని పోలీస్ అధికారులు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన ఒక కంపెనీలో ఐటీ డైరెక్టర్‌గా పని చేస్తూ మారతహళ్లిలోని మంజునాథ లేఅవుట్లో ఉండేవారు. భార్య కారణంగా తాను అనుభవించిన మానసిక క్షోభను వివరిస్తూ రాసిన లేఖను ఇ-మెయిల్ ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, తన కార్యాలయం అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులకు పంపించాడు. తన నివాసంలో అర్ధరాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకొనే ముందు దాదాపు 80 నిమిషాల వీడియోను చిత్రీకరించాడు.

## 200 సీట్లా..! డీఎంకే పగటి కలలు కంటోంది: పళనిస్వామి



చెన్నై: రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లు గెలుచుకొని తిరిగి అధికారంలోకి వస్తుందంటూ ఆ పార్టీ నేతలు చేస్తోన్న వ్యాఖ్యలపై అన్నాడీఎంకే నేత, మాజీ సీఎం పళనిస్వామి స్పందించారు. 200 సీట్లు గెలుస్తామంటూ ఇస్తున్న నినాదం కేవలం పగటి కలగానే మిగిలిపోతుందని.. అదెప్పటికీ నిజం కాదన్నారు. మొత్తంగా 234 స్థానాలున్న తమిళనాడు శాసనసభకు 2026లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో తమ పార్టీ (అన్నాడీఎంకే) సారథ్యంలోని కూటమి మాత్రమే 200 సీట్లు గెలుచుకుంటుందని పళనిస్వామి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం చెన్నైలో జరిగిన అన్నాడీఎంకే జనరల్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2025 జనవరి నుంచి అన్ని నియోజకవర్గాలను కవర్ చేసేలా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు ప్రకటించారు.జమిలి ఎన్నికల బిల్లులపై పునరాలోచనలో కేంద్రం..!డీఎంకే పాలనలో అన్నిస్థాయిల్లో అవినీతి జరిగిందని ఆరోపించిన పళనిస్వామి..

ప్రభుత్వోద్యోగులు, రవాణా కార్మికులతో పాటు పలు వర్గాల నుంచి ప్రభుత్వం నిరసనఎదుర్కొంటోందన్నారు. సీఎం స్టాలిన్‌ది అసమర్థ ప్రభుత్వమన్నారు. విల్లుపురం, కడలూరు, తదితర ప్రాంతాల్లో వర్షాలు, వరదల పరిస్థితిపై వాతావరణ

శాఖ అధికారులు రెడ్‌అలర్ట్‌లు జారీ చేసినా చర్యలు తీసుకోకుండా స్టాలిన్ కుంభకర్ణుడిలా నిద్ర పోయారని ఎద్దేవా చేశారు. అసలు రెడ్ అలర్ట్ లక్ష్యమే ముందు జాగ్రత్తలు తీసుకోవడమని.. కానీ, డీఎంకే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ కన్నుమూత



విల్లివాక్కం: కాంగ్రెస్ సీనియర్ నేత, ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్(75) అనారోగ్యంతో చెన్నైలో మృతి చెందారు. జ్వరం రావడంతో ఆయన నవంబరు 13న చెన్నై మనప్పాక్కంలోని మియాట్ ఆస్పత్రిలో చేరారు.

ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్య తలెత్తడంతో వైద్యం అందించారు. అనంతరం ఆరోగ్యం క్షీణించడంతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ శనివారం ఉదయం 10.30కు తుదిశ్వాస విడిచారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పరామర్శించారు.

శివాజీ గణేశన్ అభిమాని..

ఈవీకేఎస్ ఇళంగోవన్ 1948 డిసెంబరు 21న ఈరోడ్‌లో జన్మించారు. చెన్నై ప్రెసిడెన్సీ కళాశాలలో బీఏ ఎకనామిక్స్ పూర్తి చేశారు. పెరియార్ మనవడు, ఈవీకేఎస్ సంపత్ కుమారుడి గుర్తింపుతో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఇళంగోవన్ ప్రముఖ నటుడు శివాజీ గణేశన్ వీరాభిమాని. ఆయన్నే రాజకీయ గురువుగా భావిస్తుంటారు. ఆయన సూచన మేరకు కాంగ్రెస్ తరఫున 1984 శాసనసభ ఎన్నికల్లో సత్యమంగళం నియోజకవర్గం నుంచి పోటీచేసి డీఎంకే అభ్యర్థికన్నా రెండింతల ఓట్లు పొంది ఎమ్మెల్యే అయ్యారు. అనంతరం కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, సీతారాం కేసరి ఇళంగోవన్‌ను 1996లో టీఎన్‌సీసీ అధ్యక్షునిగా నియమించారు.

2001 వరకు పార్టీ బలోపేతానికి కృషి చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ నేతృత్వంలోని మంత్రివర్గంలో కేంద్ర జౌళిశాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. టీఎన్‌సీసీ అధ్యక్షునిగా రెండోసారి 2014 నుంచి 2017 వరకు వ్యవహరించారు. 2023లో ఇళంగోవన్ పెద్ద కుమారుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే తిరుమగన్ ఈవెరా గుండెపోటుతో మృతి చెందారు. ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గ ఉప ఎన్నికలో డీఎంకే-కాంగ్రెస్ కూటమి తరఫున ముఖ్యమంత్రి కోరిక మేరకు ఇళంగోవన్ పోటీ చేసి విజయం సాధించారు. సుమారు 39 ఏళ్ల తర్వాత మళ్లీ రాష్ట్ర శాసనసభలో అడుగుపెట్టారు.

## అధిక వడ్డీ ఆశతో డబ్బులేస్తున్నారా?




బ్యాంకులు అధిక వడ్డీ ఆఫర్ చేస్తున్నాయని మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారా? అయితే, ఎఫ్‌డీల్లోనూ కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. అసలు ఫిక్స్‌డ్ డిపాజిట్ వల్ల ఎలాంటి నష్టాలు ఉంటాయి, ఎందుకు బ్యాంకులో డబ్బులు దాచుకోకూడదు అనేందుకు 5 రకాల కారణాలను ఇప్పుడు మనం తెలుసుకుందాం.

అధిక వడ్డీ ఆశతో బ్యాంకులో డబ్బులేస్తున్నారా? కష్టపడి సంపాదించిన డబ్బులను ఎలాంటి రిస్క్ లేకుండా అధిక వడ్డీ అందించే పెట్టుబడి మార్గంలో పెట్టి రాబడి అందుకోవాలని చాలా మంది భావిస్తుంటారు. అలాంటి వారు ముందుగా ఆలోచించేంది బ్యాంకులు అందించే ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలే. ఇటీవలి కాలంలో బ్యాంకులు సైతం గరిష్ఠ వడ్డీ రేట్లు అందిస్తున్నాయి. కొన్ని స్పెషల్ స్కీమ్స్ ద్వారా అదనపు వడ్డీని అందిస్తున్నామని చెబుతున్నాయి. దీంతో ఆయా పథకాల్లో తమ డబ్బులను డిపాజిట్ చేస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం చాలా బ్యాంకుల్లో 7 శాతానిపైగా వడ్డీ రేట్లు ఉన్నాయి. మంచి రాబడి కోరుకునే వారు ఇప్పుడు డిపాజిట్ చేయడానికి మంచి సమయంగా చెప్పవచ్చు. కొన్ని చిన్న బ్యాంకుల్లో ఏకంగా 9 శాతం మేర వడ్డీ రేట్లు ఉన్నాయి.

అయితే,

బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే ముందు వాటిలో ఉండే ప్రతికూ లతలు సైతం తెలుసుకోవాలి. చాలా మందికి పోస్ట్ ట్యాక్స్ రిటర్న్ అనేవి 5 శాతం వడ్డీతో అందుతాయి. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ అమౌంట్ పై వచ్చే వడ్డీ పైనా ట్యాక్స్ పడుతుంది. రాబడి తగ్గిపోతుంది పన్నుల కారణంగా మీ చేతికి అందే సంపద మొత్తం చాలా తగ్గిపోతుందని చెప్పవచ్చు. ద్రవ్యోల్బణ ప్రకారం చూసుకుంటే దీర్ఘకాలంలో మీ రాబడిలో భారీగా కోత పడుతుంది. ఉదాహరణకు పైన పేర్కొన్నట్లు 5 శాతం రిటర్న్ అనేవి యావరేజ్ కన్స్యూమర్ ఇన్‌ఫ్లేషన్ రేటుతో పోల్చినట్లయితే చాలా తక్కువ అని చెప్పవచ్చు. ఇది దీర్ఘకాలంలో మీ సంపదను మరింత తగ్గిస్తుంది. ట్యాక్స్ సేవింగ్స్‌కు సరైనది కాదు ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్‌లోని సెక్షన్ 80సీ కింద ట్యాక్స్ సేవింగ్స్ కోసం చాలా మంది 5 ఏళ్ల మెచ్యూరిటీ టెన్యూర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెడుతుంటారు. సెక్షన్ 80 సీ ద్వారా ట్యాక్స్ డిడక్షన్ లిమిట్ రూ. 1.5 లక్షల వరకు మాత్రమే ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా వచ్చే రాబడి ట్యాక్స్ పరిధిలోకి వస్తుంది కాబట్టి ట్యాక్స్ సేవింగ్స్ కోసం ఎఫ్‌డీ చేయడం అంత ప్రభావవంతమైన ఎంపిక కాదని చెప్పవచ్చు. ముఖ్యంగా శాలరీ అందుకునే వారు, ఇతర వేతన జీవులు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు కాకుండా పీపీఎఫ్, వీపీఎఫ్, ఎన్‌పీఎస్ వంటి ఇతర ట్యాక్స్ ఫ్రీ రిటర్న్ ఇచ్చే పథకాలను ఎంచుకోవడం ఉత్తమం. రూ.5 లక్షల వరకే బీమా కవరేజీ మీరు బ్యాంకులో ఎంత మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినా మీకు రూ.5 లక్షల వరకే ఇన్సూరెన్స్ భద్రత ఉంటుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ ఆధ్వర్యంలోని డీఐసీజీసీ ఇన్సూరెన్స్ అనేది రూ.5 లక్షల వరకు బీమా రక్షణ కల్పిస్తుంది.

అయితే, పోస్టాఫీసు స్కీమ్ పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, కేవీపీ వంటివి గ్యారంటీ రిటర్న్ ఇస్తాయి. వాటికి కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అలాగే ట్యాక్స్ బెనిఫిట్స్ కూడా ఉంటాయి. దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసి మంచి రాబడి కోరుకునే వారికి ఎఫ్‌డీ సరైన మార్గం కాదనే చెప్పాలి. బ్యాంక్ ఎఫ్‌డీతో పోలిస్తే పీపీఎఫ్, వీపీఎఫ్, ఎన్‌పీఎస్ అనేవి ట్యాక్స్ ఫ్రీ రిటర్న్ అందిస్తాయి. అలాగే పలు మ్యూచువల్ ఫండ్స్ సైతం దీర్ఘకాలంలో ఎక్కువ రాబడిని ఇస్తాయి.

వేగుచుక్క

# ప్రభుత్వ ఆదేశం ఎమ్మెల్సీ కవిత ధిక్కరణ.

**ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ.**
**గ్రామ గ్రామాన ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తాం అని సవాల్.**
**సారంగాపూర్ కస్తూర్బా పాఠశాల సందర్శణ.**
**పెంచిన డైట్ చార్జీలను కస్తూర్బా పాఠశాలలకూ అమలు చేయాలని డిమాండ్.**





**వేగుచుక్క న్యూస్, జగిత్యాల, డిసెంబర్ 15**

ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ ను, ఆదేశాలను ఎమ్మెల్సీ కవిత ధిక్కరించారు. జగిత్యాల పట్టణంలో ఉద్యమ తెలంగాణ తల్లి ఏర్పాటుకు ఆమె పూనుకున్నారు. ఆదివారం భారీ ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించడానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ కార్యకర్తలు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ కవిత పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్ని జీవోలు, గెజిట్ లు జారీ చేసినా ఉద్యమ తెలంగాణ తల్లినే తాము ప్రతిష్టించుకుంటామని తేల్చిచెప్పారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదని, ఉద్యమకాలంలో తెలంగాణ తల్లి తమకు స్ఫూర్తిని ఇచ్చిందని, ధైర్యాన్ని నింపిందని అన్నారు. ఉద్యమ తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మను కాపాడుకొని విశ్వమంతా వ్యాపింపజేస్తామని, తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదాడిని గ్రామ గ్రామాన ఎండగడుతామని అన్నారు.

**సారంగాపూర్ కస్తూర్బా పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ కవిత**

జగిత్యాల జిల్లా సారంగాపూర్ లోని కస్తూర్బా పాఠశాలను ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. అక్కడ విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందితో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కస్తూర్బా పాఠశాలలకు కూడా పెంచిన డైట్ చార్జీలను ప్రభుత్వం వర్తింపజేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 472 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయని, పెద్ద సంఖ్యలో విద్యార్థులున్నారని, కాబట్టి ఈ పాఠశాలలకు కూడా పెంచిన డైట్ చార్జీలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా విద్యార్థినులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని, ఈ విషయంపై రాజీ పడవద్దని ప్రభుత్వానికి సూచించారు. కేసీఆర్ ఏ లక్ష్యంతో అయితే గురుకుల పాఠశాలల పెట్టారో ఆ లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా ఈ ప్రభుత్వం వ్యవరించిందని, దానికి ప్రతిచర్యగా బీఆర్ఎస్ ఉద్యమిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమాల వల్ల ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచడం, నూతన డైట్ మెనూను విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. సర్వ శిక్ష అభియాన్ పథకం కింద పనిచేస్తున్న వారితో పాటు కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను రెగ్యులరైజ్ చేస్తానని గతంలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే ఆ హామీని అమలు చేసి టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

## బిఆర్ఎస్ పోరాట ఫలితమే మెస్ చార్జీల పెంపు.

**పట్టణ యువజన విభాగం అధ్యక్షులు చెలిమెల భాను ప్రసాద్ నేత.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 15:**



బిఆర్ఎస్ పోరాట ఫలితంగానే ప్రభుత్వం మెస్ చార్జీల పెంపు చేసిందనిబిఆర్ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షులు చెలిమెల భాను ప్రసాద్ నేత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా గురుకులాల్లో, కేజీవీబీలలో సమస్యలపై టిఆర్ఎస్ పార్టీ గురుకుల బాట కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోవడం వల్ల ఫుడ్ పాయిజన్ తో ఆసుపత్రి బెడ్లను ఎక్కించారని అన్నారు. గత కేసిఆర్ ప్రభుత్వంలో గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులను ఎవరెస్ట్ వంటి శిఖరాలను అధిరోహించే శక్తి సామర్థ్యాలను విద్యార్థులను అందించారని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాలు ప్రభుత్వ పాఠశాలలో సంక్షేమ వసతి గృహాలు రెసిడెన్షియల్ పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించి వాళ్లకు కావాల్సిన అన్ని మెరుగైన వసతులు కల్పించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, మసూద్, శ్రీను, గఫర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ గ్రూప్-2 పరీక్షలు.

**- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 15 :**





రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆదివారం ఉదయం సెషన్ లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 19,855 మంది అభ్యర్థులకు గాను, 9070 మంది హాజరు కాగా, 10,785 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు.

## విశ్రాంత ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం.

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.**





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 15:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వారు నిర్వహించిన నిజామాబాద్ జిల్లా స్థాయి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల క్రీడా పోటీలను ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర కీలకమైందన్నారు. వారు అందించిన సేవలను కొనియాడారు. విశ్రాంతి ఉద్యోగుల క్రీడా పోటీల ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బిన్, జిల్లా అధ్యక్షులు మామిడ్యాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భోజ గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్ కార్ లక్ష్మి నారాయణ, రిటైర్డ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## అల్లు అరెస్టులో రాజకీయ అత్యుత్సాహం

ఎవరైనా ప్రముఖుని అరెస్టు జరిగిన సందర్భంలో సహజంగానే చర్చ అంతా ఆ వ్యవహారం చుట్టే తిరుగుతుంది. మంచి చెడులు తప్పొప్పుల మాటలు అప్పుడు కనిపించవు. ఎవరికి తోచిన విధంగా వారు స్పందిస్తారు. ప్రజాదరణ కలిగిన నటుడు అల్లు అర్జున్ అరెస్టు విషయంలోనూ ఇదే జరుగు తోంది. ఇందులో వింత ఏమీ లేదు. ఈ అరెస్టు వ్యవహారం తెలుగు రాష్టాల్లోన్రే కాదు.. దేశవ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారింది. అయితే అల్లు అర్జున్ అరెస్టుపై సినిమా ఇండస్టీ కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, నేతలు స్పందించారు. ఇంకా స్పందిస్తూనే ఉన్నారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయి స్పందన రాలేదు. అల్లు అర్జున్‌కు రాజకీయాలకు సంబంధం ఏమిటి అనే ప్రశ్న ఇప్పుడు అనివార్యంగా వస్తుంది. అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు ఆగమేఘాల మీద స్పందించారు. అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఆ తర్వాత బీజేపీ నుంచి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి నాయకులు స్పందించి.. అరెస్టును తప్పుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ కాబట్టి వీరు అరెస్టయిన వ్యక్తికి మద్దతు ఇచ్చారని అనుకోవచ్చు. కానీ ఈ ఒక్క కారణం సరిపోతుందా అనేది ప్రజలే తేల్చాలి.

క ఇదే సమయంలో కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్ రెడ్డి మొదలుకొని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వరకూ ఈ అరెస్టుపై స్పందించారు. కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి.. చట్టం తన పని తాను చేసుకుపోతుందనేది రొటీన్ డైలాగ్. వీరూ అదే మాట చెప్పారు. అరెస్టును సమర్థించారు. నిజమే చట్టం తన పని తాను చేసుకుపోతుంది.. చేసుకుపోవాలి కూడా. కానీ ఇంత అత్యుత్సాహంతో ..వదిలితే ఇక దొరకడు అన్న విధంగా ఆగమేఘాల మీద అరెస్టు చేయటం అవసరమా? అనేది కూడా ప్రజలే తేల్చుకోవాలి.

ఇక, వ్యవహారం సినిమా స్టార్ కు సంబంధించినది కనుక ఏపీ రాజకీయ పార్టీలు కూడా స్పందించాయి. ఐతే, అధికార టీడీపీ,, జనసేన పార్టీ నుంచి పెద్దగా స్పందన లేదు. ద్వితీయ శ్రేణి నాయకులు స్పందించి, అరెస్టును ఖండించారు. కానీ, ప్రతిపక్ష వైసీపీ తీరు ఆసక్తికరంగా ఉంది. పార్టీ అధినేత జగన్ మొదలు.. సాధారణ కార్యకర్త వరకూ బన్నీఅరెస్టుపై స్పందించారు. అన్ని పార్టీల కంటే ఓ అడుగు ముందుకేసి.. అల్లు అర్జున్ అరెస్టు వెనక చంద్రబాబు కూడా ఉన్నారని వైసీపీ ఆరోపించింది. ఇక వైసీపీ సోషల్ మీడియా అయితే.. గతంలో ఎప్పుడూ లేనివిధంగా సపోర్ట్ పోస్టింగ్ పెట్టింది. 'నువ్ మా కోసం నిలబడ్డావ్.. మేము నీ కోసం నిలబడతాం' అంటూ వైసీపీ కార్యకర్తలు పోస్టులు పెట్టారు. అటు బన్నీ కేసులో హైకోర్టులో వాదించిన లాయర్ నిరంజన్ రెడ్డి వైసీపీ తరఫున రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. దీంతో ఈ వ్యవహారాన్ని వైసీపీ ఓన్ చేసుకుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్ లో కాపు నేతగా పవన్ కల్యాణ్ కు బన్నీ ద్వారా చెక్ పెట్టే వ్యూహం ఏమైనా దీనిలో ఉన్నదా అనే అనుమానం కలుగుతుంది.

ఇది ఇలావుంటే, బన్నీ అరెస్టు వ్యవహారంలో ఓ ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. పుష్ప-2 సక్సెస్ మీట్ సందర్భంగా అల్లు అర్జున్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు.

## జమిలి' చిక్కుముడులు అన్నీ ఇన్నీ కావు

ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించే బిల్లులనే ప్రభుత్వం తీసుకొస్తున్నట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలపై తరువాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సుల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాల్సి ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల విషయం ప్రస్తుతానికి పక్కనపెట్టి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపై తీసుకొచ్చిన బిల్లులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి 50 శాతం రాష్ట్రాల ఆమోదం తెలపవలసిన అవసరం లేదని చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణతోపాటు 50 శాతం రాష్ట్రాలు ఆమోదించవలసి వస్తుంది. ఈ జమిలి ఎన్నికలకు దేశంలో 32 పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. దీని వల్ల స్థానిక, ప్రాంతీయ అంశాలు పక్కకు పోయి జాతీయ అంశాలదే పైచేయి అవుతుందని ప్రాంతీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వన్ నేషన్, వన్ ఎలక్షన్ ప్రక్రియ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎవరెంత మొత్తుకున్నా ప్రధాని మోడీ పట్టించుకోలేదు. జమిలి ఎన్నికల ఆలోచన వెనుక ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే 2015నాటి ఓ సర్వే ప్రకారం ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 77 శాతం ఓటర్లు రెండింటా ఒకే పార్టీకి ఓటు వేస్తారని తేలింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే బిజెపి నేతలు జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకువస్తున్నారని ఒక అంచనా. దేశమంతటా డబుల్ ఇంజన్ సర్కారుకై తహతహలాడుతున్న బిజెపి ఓటర్ల తాలూకు ఈ ఏకకాలపు ఎన్నికల మనస్తత్వం కలిసొస్తుందని బిజెపి ఆశపడుతోంది.

వేగుచుక్క

# పాలెంలో "సిరి" ఆసుపత్రి మెగా ఆరోగ్య వైద్య శిబిరం.



**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, డిసెంబర్ 15:**

మోర్తాడ్ మండలం, పాలెం గ్రామంలో ఆదివారం ఆర్మూర్ పట్టణంలో గల ప్రముఖ సిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య వైద్య శిభిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 400 మంది గ్రామస్తులు హాజరు కాగా, వారికి ఉచితంగా షుగర్, ఈసిజి, కొలెస్ట్రాల్, బిఎండి (బోన్ మైనీరల్ డెన్సిటీ) పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ లింగారెడ్డి, డాక్టర్ శిరీషా, డాక్టర్ అజయ్ రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సునీల్, డాక్టర్ ఈశ్వంత్, డాక్టర్ సౌమ్యా హాజరయ్యి, రోగులకు సలహాలు, సూచనలు అందించారు. అలాగే అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

**ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ లింగారెడ్డి అవగాహన.**

సిరి ఆస్పత్రి నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో డాక్టర్ లింగారెడ్డి ప్రత్యేకంగా ఆరోగ్య రక్షణకు సంబంధించిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ప్రధానంగా బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవడం వల్ల అనేక రోగాల బారిన పడకుండా జాగ్రత్త గా ఉండవచ్చని అన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం సరైన ఆహారం, వ్యాయామంతో పాటు సమయోచిత వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని వివరించారు. "రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం, జంక్ ఫుడ్స్ ను నివారించడం, పళ్ళు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు చేస్తుందని" ఆయన గ్రామస్థులకు చెప్పారు.ప్రముఖ గైనకాలిస్ట్ డాక్టర్ శిరీషా మాట్లాడుతూ, మహిళలు అనారోగ్యానికి గురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దానివల్ల అనేక జబ్బులను మొదట్లోనే గుర్తించి, వైద్యం తీసుకోవడం ఉత్తమం అని అన్నారు.

పెద్ద ఎత్తున వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల సిరి ఆసుపత్రి యాజమాన్యాన్ని, వైద్యులను పాలెం గ్రామంలోని ప్రజలు అభినందించారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా సిరి ఆసుపత్రి గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవలు అందించడం, రోగాల పట్ల అవగాహన కల్పించడం పై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.




**సుమారు 400 మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు.**

**బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలి.**

**ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ లింగారెడ్డి వెల్లడి.**

# బిజెపి విధానం రాజ్యాంగ మూల సూత్రాలకే ప్రమాదం.

**మార్క్సిస్టు, అంబేడ్కరిస్టు, సైద్ధాంతిక రచయిత సాదు మాల్యాద్రి.**

**రెండవ రోజు కొనసాగిన బిఎల్ పి రాష్ట్ర మహాసభలు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 15:**




కేంద్రలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విధానాల వల్ల రాజ్యాంగ మౌలిక సూత్రాలకే పెను ప్రమాదంగా ఉందని మార్క్సిస్టు, అంబేద్కరిస్టు సైద్ధాంతిక విశ్లేషకులు, రచయిత సాదు మాల్యాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలు రెండవ రోజైన ఆదివారం ప్రతినిధుల సభ జరుపుకున్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మార్క్సిజం, అంబేద్కరిజం శ్రామిక వర్గ ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయం అంశంపై మాట్లాడారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం అనంతరం ఇంకా దేశంలో కుల వివక్షతతో కూడిన అసమానతలు పెరిగాయని అన్నారు. భారత బహుజన శ్రామిక ప్రజలు గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రమ్మ ఫూలే, అంబేద్కర్, సాహు మహారాజ్, పెరియార్ లాంటి మహానీయుల ఆలోచన విధానంతో ఉద్యమించడం ద్వారా బిజెపి మతోన్మాద రాజకీయాలను ఓడించడం సాధ్యమవుతుందని సాదు మాల్యాద్రి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు విప్లవ శక్తులు పార్లమెంటరీ ప్రజాస్వామ్య ద్వారా అధికారంలోకి వస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో శ్రీలంకలో మార్క్సిస్టు పార్టీ నేత ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నికైన విషయాన్ని గుర్తు చేశారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ పాలనను వ్యతిరేకించే బిజెపి నాయకులు వాజపేయ్ ఐదు సంవత్సరాలు, ప్రస్తుత మోదీ నాయకత్వంలో 11 సంవత్సరాలు మొత్తం 16 సంవత్సరాల పాటు దేశాన్ని పాలిస్తూ, కాంగ్రెస్ పార్టీ పాలన కంటే ఏ విషయంలో భిన్నంగా ఉందని సాదు మాల్యాద్రి ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా మద్దతు ధర కోసం ఉద్యమించిన రైతులపై కనీస వేతనాల చట్ట కోసం ఉద్యమించిన కార్మిక వర్గంపై మోదీ ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా అణిచివేత చర్యలకు పాల్పడుతుందన్నారు. రెండవ రోజు ప్రతినిధుల సభకు ఆ పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు వడ్ల సాయి కృష్ణ, ముద్రకోల ఆంజనేయులు, పోషవ్వ, సి. హెచ్. కళా, అరుణలు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ది రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లత పాల్గొన్నారు.

# సర్వశిక్ష" ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి.



**టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సత్యానంద్, ఓ.రమేష్ డిమాండ్.**

**ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం సమ్మెకు మద్దతు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 15:**

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.సత్యానంద్, ఓ.రమేష్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ ధర్నా చౌక్ లో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మె కార్యక్రమానికి ఆదివారం టీఎస్ యుటిఎఫ్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న ఉద్యోగులు అదేవిధంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 15 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని, పదవి విరమణ బెనిఫిట్స్ 20 లక్షలు ఇవ్వలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సాయన్న, డిచ్ పల్లి మండల బాధ్యులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# "సన్ రైజ్" ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం.






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 15:**

నగరంలోని "సన్ రైజ్" హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక నగర్ లోని అమరవీరుల పార్క్ వద్ద వాకర్స్ కు ఉచిత హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో ఉచితంగా బీపీ, షుగర్ టెస్ట్ లు నిర్వహించడంతో పాటు జనరల్ ఫిజిసియన్ ఆధ్వర్యంలో ఇతర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు సైతం అందజేశారు. సన్ రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో ఉచితంగా హెల్త్ చెకప్ క్యాంపు లు నిర్వహించడం జరుగుతున్నదని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ విష్ణు, కో ఆర్డినేటర్ సంతోష్, స్టాఫ్ నర్సులు శశికల, భీమ్ రావ్, జమున పాల్గొన్నారు.

# వారాహి మాత" దేవాలయ నిర్మాణానికి అంకురార్పణ.

**- వృక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, డిసెంబర్ 15:**



నగరంలోని అమ్మ నగర్ (అమ్మ వెంచర్)లో నూతనంగా శ్రీ వారాహి మాత దేవాలయం అంకురార్పణ వృక్షోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అపర శక్తి, అపర దయామయి అయిన వారాహి మాత ఆలయము ఇందూరు నగరంలో మొట్టమొదటి ఆలయం కాబోతోందని అన్నారు. ఈ ఆలయ ప్రాంగణానికి సహకరించిన అమ్మ వెంచర్ కమిటీ సభ్యులు అధ్యక్షులు నరేష్, కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆలయ నిర్మాణం సంకల్పము అమ్మవారి అనుగ్రహము, ఈ ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చినా అటువంటి మా ఆప్త మిత్రుడు మంచాల జ్ఞానేందర్ స్వామికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 10 న శ్రీ హంపి పీఠాధిపతి చేతులమీదుగా భూమి పూజ కార్యక్రమము జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ వెంచర్ కమిటీ సభ్యులు, హార్ట్ ఫుల్ యువర్ వాకింగ్ టీం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.